టీడీపీ బంద్‌కు స్పందన కరువు


రాయదుర్గం: వినాయకసర్కిల్‌లో జన సంచారం


కళ్యాణదుర్గం: పట్టణంలో యథావిధిగా వాహనాల రాకపోకలు


ఉరవకొండ: ఆర్టీసీ సర్వీసులు నడుస్తున్న దృశ్యం

- యథావిధిగా వాహనాల రాకపోకలు
- తెరుచుకున్న వ్యాపార సంస్థలు
- బంద్‌ను పట్టించుకోని ప్రజలు

రాయదుర్గం: తెలుగుదేశం పార్టీ సోమవారం ఇచ్చిన బంద్ పిలుపు రాయదుర్గంలో విఫలమైంది. ప్రజా జీవనం యథావిధిగా కొనసాగింది. వ్యాపార సముదాయాలు, వివిధ దుకాణాలు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు కొనసాగించారు. ప్రయాణికులకు ఇబ్బందులన్న మాటే వినిపించకుండా అన్నీ రూట్లలోనూ ఆర్టీసీ బస్సులు నడిపారు. స్కిల్ స్కాం కేసులో టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు సీఐడీ అధికారులకు అడ్డంగా దొరికిపోయి అరెస్ట్.. ఆపై రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించిన విషయం విదితమే. ఈ పరిణామాలను నిరసిస్తూ .. టీడీపీ, దాని మిత్ర పక్షపార్టీల ఆధ్వర్యంలో బంద్‌కు పిలుపునిచ్చారు. టీడీపీ నాయకులు బంద్ చేయాలని దుకాణ యజమానులను బతిమాలుకున్నా పట్టించుకోలేదు. చివరకు పార్టీ నాయకులు చేతులెత్తేయడంతో కార్యకలాపాలన్నీ యథావిధిగా కొనసాగించారు. చంద్రబాబు అరెస్టును ప్రజలెవ్వరు పట్టించుకోవడం లేదనేందుకు బంద్ ప్రభావం లేకపోవడమే నిదర్శనం. స్కిల్ స్కాం లో బాబు అవినీతి రుజువుకావడంతోనే జైలుకెళ్లాడనేది ప్రజలు బలంగా నమ్ముతున్నారు. ఈ కారణంగానే బంద్‌ను పెద్దగా ప్రజలెవ్వరు పట్టించుకోలేదు.

కళ్యాణదుర్గం: టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు అరెస్టును నిరసిస్తూ సోమవారం ఆ పార్టీ నాయకులు చేపట్టిన బంద్‌కు ప్రజల నుంచి స్పందన కరువైంది. ఉదయం నుంచి ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్ వాహనాల రాకపోకలు యథావిధిగా సాగాయి. వ్యాపార సముదాయాలు తెరుచుకున్నాయి. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. చంద్రబాబు అరెస్టుపై ప్రజల్లో ఎలాంటి స్పందన కనిపించలేదు. కాగా ఉదయం పార్టీ ఆదేశాల మేరకు టీడీపీ శ్రేణులు బంద్ చేపట్టేందుకు యత్నించి విఫలం అయ్యారు. చంద్రబాబు అరెస్టయితే మాకేంటి అంటూ ప్రజలు ప్రశ్నించడంతో టీడీపీ నాయకులు ఇంటికి వెళ్లాల్సి వచ్చింది. శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలిగించకుండా సిబ్బందితో కలసి డీఎస్పీ బి.శ్రీనివాసులు బందోబస్తు పర్యవేక్షించారు.

ఉరవకొండ: టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు స్కిల్ స్కాంలో ఆధారాల సహా అరెస్టయి రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించిన నేపథ్యంలో టీడీపీ నేతలు సోమవారం రాష్ట్ర బంద్‌కు పిలుపునిచ్చారు. ఉరవకొండలో బంద్‌కు ప్రజల నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో ఉదయం నుంచి ఆర్టీసీ సర్వీసులు వివిధ ప్రాంతాలకు నడిచాయి. దీంతోపాటు వ్యాపార దుకాణాలు, ప్రైవేట్, ప్రభుత్వ కార్యాలయాలు యథావిధిగా పనిచేశాయి. ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలు తెరచుకున్నాయి. టీడీపీ కార్యకర్తలు ఎవరూ బయటకు రాకపోవడంతో నాయకులు కూడా ఇళ్లలోనే ఉండిపోయారు. ఉరవకొండ అర్బన్, రూరల్ సీఐలు హరినాథ్, శేఖర్ అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

ఈఓఆర్డీ బాధ్యతల స్వీకరణ


ఈఓఆర్డీ ఎం.లక్ష్మీనరసమ్మ

కూడేరు: మండల ఈఓఆర్డీగా ఎం.లక్ష్మీనరసమ్మ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈమె ఓబుళదేవచెరువు మండలం కొండకమర్ల పంచాయతీ గ్రేడ్-1 కార్యదర్శిగా పనిచేస్తూ ఈఓఆర్డీగా పదోన్నతిపై ఇక్కడికి బదిలీ అయ్యారు. ఇక్కడ ఇంతవరకూ ఉరవకొండ ఈఓఆర్డీ చంద్రమౌళి ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు నిర్వహించారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం ఈమె విలేకరులతో మాట్లాడారు. కార్యదర్శులు, ప్రజా ప్రతినిధులను సమన్వయం చేసుకుని పంచాయతీల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

అనారోగ్యంతో వార్డు సభ్యుడి మృతి


గొల్ల రాజశేఖర్ (ఫైల్)

కుందుర్పి: మండలంలోని కదరంపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు, వార్డు సభ్యుడు గొల్ల రాజశేఖర్(40) సోమవారం అర్ధరాత్రి అనారోగ్యంతో మృతి చెందాడు. అడికి భార్య, ఇద్దరు కుమారులున్నారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సత్యనారాయణశాస్త్రి, ఎంపీపీ కమలమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు రాధాస్వామి, ఆర్‌బీకే మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి, సర్పంచ్ జగన్, నాయకులు పోతిరెడ్డి తదితరులు మృతదేహం వద్ద నివాళులర్పించారు.

ఆర్థిక ఉగ్రవాది చంద్రబాబు


మాట్లాడుతున్న విప్ కాపు రామచంద్రారెడ్డి

- ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి ధ్వజం

రాయదుర్గం: మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆర్థిక ఉగ్రవాది అని రాష్ట్ర ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి ధ్వజమెత్తారు. సోమవారం రాయదుర్గంలోని రోడ్లు, భవనాల శాఖ అతిథి గృహంలో ఆయన మీడియాతో మాట్లాడారు. 14 ఏళ్ల పాలనలో చంద్రబాబు ప్రజాధనాన్ని పెద్ద ఎత్తున లూటీ చేశారన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ పేరిట రూ.371 కోట్లు స్వాహా చేశాడు కాబట్టే రాయదుర్గం పర్యటనలో తనను రేపోమాపో అరెస్టు చేయొచ్చని ప్రజల ముందు ఒప్పుకున్నాడన్నారు. సాక్ష్యాధారాలతో పట్టుబడినా, సిగ్గుతో తలదించుకోవాల్సింది పోయి ఎదురుదాడి చేస్తూ హైడ్రామాకు తెరతీశారన్నారు. ఢిల్లీ లాయర్ల బృందాన్ని రంగంలోకి దించినా రిమాండ్ తప్పలేదన్నారు. అంతిమంగా న్యాయమే గెలిచిందన్నారు. బాబు 40 ఏళ్ల రాజకీయ జీవితకాలమంతా అక్రమాలు, అవినీతి, దౌర్జన్యాలు, దోపిడీలేనని ఎద్దేవా చేశారు. కేసులన్నీ విచారణ చేయిస్తే ఊపిరి ఉన్నంత వరకు జైలు తప్ప బెయిలు అనేది ఉండదన్నారు. ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి, చెప్పులు వేయించిన ద్రోహి చంద్రబాబు అని అన్నారు. పాపం పండి జైలుకు వెళ్లడంతో ఎన్టీఆర్ ఆత్మకు శాంతి చేకూరినట్లయ్యిందన్నారు. 'స్కిల్' కుంభకోణంలో ఇరుక్కుని జైలుకెళితే సానుభూతి తెలిపేవారు లేకపోవడం చూస్తుంటే చంద్రబాబుకు ప్రజల్లో ఏమాత్రమూ విశ్వసనీయత లేదని అర్థమవుతోందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, వైస్ చైర్మన్లు శ్రీనివాస్‌యాదవ్, వలిబాషా, మార్కెట్‌యార్డ్ చైర్మన్ భోజరాజ్‌నాయక్, జెడ్పీటీసీ పీఎస్ మహేష్, స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ ఇల్లూరి శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు రాళ్ల తిమ్మారెడ్డి, పట్టణ కన్వీనర్ ముస్తాక్, ఎస్సీసెల్ రాష్ట్ర కార్యదర్శి బీటీపీ గోవిందు, రైతు సంఘం నాయకుడు నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థీ ఉన్నతంగా చదవాలి


మాట్లాడుతున్న మంత్రి కేవీ ఉషశ్రీ చరణ్


వాటర్ ప్లాంట్ ప్రారంభిస్తున్న మంత్రి

కళ్యాణదుర్గం: ప్రతి విద్యార్థీ ఉన్నతంగా చదవాలన్నదే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి కేవీ ఉషశ్రీచరణ్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ వెనుకబడిన తరగతుల కళాశాల బాలికల వసతి గృహంలో సోమవారం రెన్యూ ఎనర్జీ సంస్థ సౌజన్యంతో 1000 ఎల్‌పీహెచ్ కెపాసిటీతో ఏర్పాటు చేసిన నీటి శుద్ధీకరణ ప్లాంట్ (మినరల్ వాటర్ ప్లాంట్) ను రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి కేవీ ఉషశ్రీ చరణ్ ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో పేదల తలరాతలు మారాలంటే విద్య ఒక్కటే సరైన మార్గమని నమ్మి ప్రతి విద్యార్థీ ఉన్నత విద్య అభ్యసించాలన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విద్యా విధానంపై ప్రత్యేక దృష్టి పెట్టారన్నారు. అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారన్నారు. అనంతరం ధర్మన్ సెక్యూరిటీ ఇన్‌చార్జ్ కర్నల్ విక్రమ్ అయ్యంగార్ హాస్టల్ అభివృద్ధికి రూ.10 వేలు ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ బీసీ వేల్ఫేర్ గంగాద్రి, రెన్యూ ఎనర్జీ కంపెనీ ఏపీ, తెలంగాణ స్టేట్ హెడ్ త్రిభువన్, ఆపరేషన్ ఇన్‌చార్జ్ భరత్, దాస్ శ్రీనివాస్, పట్టణ కన్వీనర్ శ్రీనివాసులు, నాయకులు అఫ్జల్, పెరుగు తిమ్మరాజు, మల్లికార్జున, సురేష్, ఉమేష్, నవీన్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

జల చౌర్యంపై ఆయకట్టు రైతుల కన్నెర్ర


కణేకల్లు హెచ్చెల్సీ సబ్ డివిజన్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న రైతులు

కణేకల్లు: తుంగభద్ర ప్రధాన ఎగువకాలువకు అనుబంధమైన 7వ డిస్ట్రిబ్యూటరీలో నాన్ ఆయకట్టు రైతుల జలచౌర్యంపై ఆయకట్టు రైతుల్లో ఆగ్రహం కట్టలు తెంచుకుంది. హెచ్చెల్సీ అధికారులకు అనేక మార్లు చెప్పినా ప్రయోజనం లేకపోవడంతో సోమవారం ఆయకట్టు రైతులు మూకుమ్మడిగా 7వ డిస్ట్రిబ్యూటరీపై గస్తీ చేసి కాలువలో వేసిన మోటార్లు, పైపులను తొలగించి వాటిని కణేకల్లు హెచ్చెల్సీ సబ్ డివిజన్ కార్యాలయం ఎదుట పడేసి ధర్నా చేశారు. వివరాలు... 7వ డిస్ట్రిబ్యూటరీ పరిధిలో సుమారు 3,150 ఎకరాల ఆయకట్టు ఉంది. పంట సాగు కోసం అధికారులు ఆయకట్టుకు నీరు విడుదల చేశారు. ఐతే డిస్ట్రిబ్యూటరీ ఎగువ భాగంలో నాన్ ఆయకట్టు రైతులు విచ్చలవిడిగా మోటార్లు, పైపులు వేసి నీళ్లను తోడేసి పంటలను సాగు చేశారు. కాలువకు వదిలే నీరంతా నాన్ ఆయకట్టు రైతులు తోడేస్తుండటంతో ఆయకట్టు భూములకు నీరందక ఇప్పటికీ వరినాట్లు పడలేదు. నాన్‌ఆయకట్టు రైతులు మాత్రం తమ వరిపొలాల్లో నాట్లు వేసి రెండు దఫాలు యూరియా కూడా వేశారు. జలచౌర్యం గురించి అధికారులతో మొరపెట్టుకున్నా స్పందన లేకపోవడంతో ఆయకట్టు రైతులు మనప్పాచారి, క్రిష్టారెడ్డి, లోకేష్‌గౌడ్, వెంకటేశ్వర్‌రెడ్డి, ఆనంద్, నాగరాజు, సంగప్ప, ఆంజనేయులు తదితరులు కాలువపై గస్తీ చేపట్టి దొంగచాటున వేసిన మోటార్లు, పైపులను తొలగించారు. వాటిని ఓ ట్రాక్టర్‌లో వేసుకుని కణేకల్లు హెచ్చెల్సీ సబ్ డివిజన్ కార్యాలయం వద్దకొచ్చి ఆందోళనకు దిగారు. జలచౌర్యంపై చర్యలు తీసుకుని ఆయకట్టు భూములకు సాగు నీరందేలా చూడాలని రైతులు డిమాండ్ చేశారు. ఈ విషయమై డీఈఈ మద్దిలేటి మాట్లాడుతూ ఆయకట్టు రైతులకు సకాలంలో సాగు నీరు ఇచ్చి న్యాయం చేస్తామన్నారు. నీటిచౌర్యంపై స్పెషల్ డ్రైవ్ చేస్తూ రోజు కొన్ని మోటార్లు, పైపులను స్వాధీనం చేసుకుంటున్నామన్నారు.

జంబుకేశ్వరుడికి పూజలు


దేరా పుష్పాలంకరణలో జంబుకేశ్వరస్వామి

రాయదుర్గంటౌన్: శ్రావణమాసం చివరి సోమవారాన్ని పురస్కరించుకుని పట్టణంలోని కోటలో వెలసిన స్వయంభు జంబుకేశ్వరస్వామికి విశేష అలకరణతో పూజలు నిర్వహించారు. ప్రత్యేక రంగురంగుల దేరా పుష్పాలతో మూలవిరాట్‌కు చేసిన అలంకరణ ఆకట్టుకుంది. అర్చకుడు రామకృష్ణశర్మ ఆధ్వర్యంలో పూజలు చేపట్టారు. భక్తులు ఎద్ద ఎత్తున హాజరై మొక్కులు తీర్చుకున్నారు. అంతకుముందు స్వామికి పంచామృతాభిషేకం, రుద్రాభిషేకం, కుంకుమార్చన చేపట్టారు.

జోడు లింగాలకు క్షీరాభిషేకం



కూడేరు: శ్రావణ మాసం చివరి సోమవారం మండల కేంద్రంలోని శివపార్వతుల జోడు లింగాల ఆలయానికి జిల్లా నలమూలల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలి వచ్చారు. పురోహితుడు శివశంకర్ శాస్త్రి జోడు లింగాలకు క్షీరాభిషేకం, రుద్రాభిషేకం చేశారు. అనంతరం వివిధ రకాల పుష్పాలతో జోడు లింగాలను విశేషంగా అలంకరించారు. భక్తులు మూలవిరాట్‌ను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. పోనుగంటి ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

ఇదేం ఖర్మ రా బాబు..

- చంద్రబాబు అరెస్టుపై టీడీపీ నేతల తడబాటు


చంద్రబాబును అరెస్టు చేయాలని కార్యకర్తలు నినాదాలు చేయడంతో తలబాదుకుంటున్న టీడీపీ నేత రామ్మోహన్‌చౌదరి

కళ్యాణదుర్గం/కంబదూరు: నియోజకవర్గంలో టీడీపీ నాయకుల తడబాటుతో ఆ పార్టీ కార్యకర్తలు తలలు పట్టుకుంటున్నారు. టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లో భాగంగా అరెస్టును ఖండిస్తూ ఆ పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు చేపట్టిన నిరసన కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నేతలు మాట్లాడుతూ తడపడ్డారు. కళ్యాణదుర్గంలో ఏకంగా పార్టీ ఇన్‌చార్జి ఉమామహేశ్వర్ నాయుడు మాట్లాడుతూ సైకో చంద్రబాబునాయుడును వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అలాగే కంబదూరు మండల కేంద్రంలో చంద్రబాబు నాయుడిని అరెస్టు చేయాలంటూ టీడీపీ కార్యకర్తలు నినాదాలు చేశారు. ఇది విన్న పక్కనే ఉన్న టీడీపీ నేత రామ్మోహన్ చౌదరి నినాదాలు చేయడం కూడా రాదా? అంటూ తలబాదుకున్నారు. ఇలా చంద్రబాబు అరెస్టు కావడంపై ఎలా మాట్లాడాలో ఆ పార్టీ నాయకులకే స్పష్టత లేదని ఇక సామాన్య ప్రజలు ఎలా మద్దతు ఇస్తారంటూ ఆ పార్టీ కార్యకర్తలే బాహాటంగా వాపోతున్నారు. ఈ వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో టీడీపీ నేతలు అభాసుపాలయ్యారు.

ఎలక్ట్రికల్, మోటార్ల రిపేరీ షాపులో చోరీ

రాయదుర్గంటౌన్: పట్టణంలోని కణేకల్లు రోడ్డు లక్ష్మీబజార్‌లోని ఎస్‌బీహెచ్ బ్యాంకు పక్కన ఓ ఎలక్ట్రికల్, మోటార్ల మరమ్మతు దుకాణంలో రూ.లక్షల విలువైన సామగ్రి ఆదివారం అర్ధరాత్రి దాటిన తరువాత చోరీ చేశారు. పోలీసుల వివరాల మేరకు.. సోమవారం ఉదయం షాపు తాళాలు తెరిచి ఉండడాన్ని చూసి చోరీ జరిగినట్లు యజమాని ఆదర్శ్ గుర్తించాడు. దుండగులు తాళాలు పగలగొట్టి షాపులోకి ప్రవేశించి రిపేరీతో పాటు విక్రయానికి ఉంచి ఫ్యాన్లు, మిక్సీలు, కొన్ని స్పేర్ పార్టులను ఎత్తుకెళ్లారు. ఎలక్ట్రికల్, మోటార్ల రిపేరీ, విక్రయాలతో జీవనం సాగిస్తున్న తన షాపులో చోరీ జరిగి రూ.లక్షకు పైగా నష్టపోవడంపై బాధితుడు ఆవేదన చెందాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

రెండు ద్విచక్ర వాహనాల ఢీ - ఇద్దరికి గాయాలు

రాయదుర్గంటౌన్: రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడిన ఘటన సోమవారం రాత్రి మండలంలోని పల్లేపల్లి గేటు సమీపంలో బళ్లారి రహదారిపై జరిగింది. ప్రమాదంలో పట్టణంలోని శాంతినగర్‌లో నివాసం ఉంటున్న రాము, నరసింహులు తీవ్రంగా గాయపడ్డారు. నరసింహులు కుడికాలు తీవ్రంగా దెబ్బతినడంతో రాయదుర్గం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స అనంతరం అనంతపురానికి తరలించారు. రాము, నరసింహులు పని నిమిత్తం కర్ణాటకలోని నాగసముద్రానికి వెళ్లి తిరిగి వస్తుండగా పల్లేపల్లి గేటు వద్ద ఎదురుగా మరో ఇద్దరు వ్యక్తులు ద్విచక్రవాహనంపై వేగంగా వచ్చి ఢీకొన్నారు. వారు వెంటనే ద్విచక్రవాహనాన్ని వదిలేసి పరారయ్యారు. నరసింహులు కుడి కాలు తీవ్రంగా దెబ్బతినగా రాము తల, ముఖంపై గాయాలయ్యాయి. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా మంజునాథస్వామి ఆరాధనోత్సవం


మంజునాథస్వామి మూలవిరాట్‌కు పూజలు నిర్వహిస్తున్న వేదపండితులు


ఉత్సవ విగ్రహాన్ని ట్రాక్టర్‌లో ఊరేగిస్తున్న దృశ్యం

బొమ్మనహాళ్: మండల కేంద్రంలోని మంజునాథ స్వామి ఆలయంలో సోమవారం శ్రావణ మాస ఆరాధనోత్సవాలు ఘనంగా నిర్వహించారు. మూలవిరాట్‌కు వేదపండితులు ఉదయం 6.00 గంటలకే సుప్రభాత సేవ, 9.00 గంటలకు మహాజలాభిషేకం, స్వస్తి పుణ్యాహం, కలశపూజ, గణపతిపూజ, 11.30 గంటలకు పంచామృతాభిషేకాలు, వరుణ పూజలో భాగంగా సామూహిక ప్రార్థనలు చేపట్టారు. మధ్యాహ్నం 12.10 గంటలకు మహా మంగళహారతి కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులుఅన్నదాన కార్యక్రమం చేపట్టారు. సాయంత్రం మంజునాథస్వామి ఉత్సవ చిత్ర స్వరూపాన్ని ప్రత్యేక పూలతో అలంకరణ చేసిన ట్రాక్టర్‌లో ఏర్పాటు చేసి మంగళవాయిద్యాలు, మేళతాళాలు, భజనల మధ్య గ్రామోత్సవం నిర్వహించారు. భజన బృందాలు భజన కార్యక్రమాలను నిర్వహించారు.

సంక్షిప్త సమాచారం

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

కణేకల్లు: మండలంలోని యర్రగుంట గ్రామంలో మంగళవారం 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆలూరు చిక్కణ్ణ, పట్టణ కన్వీనర్ టి.కేశవరెడ్డి సోమవారం తెలిపారు. ఉదయం 6 గంటలకు విప్ కాపు రామచంద్రారెడ్డి కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారని, అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తప్పక హాజరు కావాలని వారు విజ్ఞప్తి చేశారు.

కోడిపల్లిలో 'పశువిజ్ఞాన బడి'

కళ్యాణదుర్గం రూరల్: మండలంలోని ఈస్ట్ కోడిపల్లిలో సోమవారం పశువిజ్ఞాన బడి కార్యక్రమం నిర్వహించారు. రైతులకు పశుసంవర్ధక శాఖ అందించు వివిధ సబ్సిడీ పథకాలను డాక్టర్ శ్రీనివాస గుప్త వివరించారు. అనంతరం సుమారు 30 పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించి, రైతులకు మందులు అందజేశారు. కార్యక్రమంలో జూనియర్ డాక్టర్ విజయకుమారి, గోపాల మిత్ర రామాంజినేయులు, రైతులు పాల్గొన్నారు.

నేటి నుంచి స్కూల్ గేమ్స్

బొమ్మనహాళ్: మండలంలోని గోవిందవాడ జెడ్పీ హైస్కూల్లో మంగళవారం స్కూల్ గేమ్స్ నిర్వహిస్తున్నట్లు మండల కోఆర్డినేటర్ హలీమా సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అండర్-14, అండర్-17 బాలురు, బాలికలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, త్రోబాల్, టెన్నికాయిట్, బాల్ బాడ్మింటన్, షటిల్, యోగ, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహిస్తామన్నారు. పోటీల్లో పాల్గొనదలచిన క్రీడాకారులు ఆయా పాఠశాలల హెచ్‌ఎంల సంతకాల పేపర్లతో హాజరు కావాలన్నారు. మండల స్థాయిలో గెలుపొందిన క్రీడాకారులు నియోజకవర్గ, జిల్లా స్థాయిలో ఆడాల్సి ఉంటుందన్నారు.

స్పందన అర్జీలన్నింటికీ పరిష్కారం

కూడేరు: స్పందన కార్యక్రమంలో ప్రజలు ఇచ్చే అర్జీలకు పరిష్కార మార్గం చూపేందుకు చర్యలు చేపడతామని తహసీల్దార్ శేషారెడ్డి తెలిపారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన స్పందనలో భూసమస్యలతో పాటు ఇతర సమస్యలపై ప్రజలు తహసీల్దార్‌కు అర్జీలు అందజేశారు. రెవెన్యూ శాఖకు సంబంధించిన అర్జీలను సంబంధిత సిబ్బందికి అందజేసి విచారణ జరిపి న్యాయం చేయాలని ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజేశ్వరి, ఎంపీడీఓ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ కాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఈ- క్రాప్ బుకింగ్ తప్పనిసరి

కణేకల్లు: రైతులు ఈ- క్రాప్ బుకింగ్ తప్పనిసరిగా చేయించుకోవాలని రాయదుర్గం ఏడీఏ లక్ష్మానాయక్ సూచించారు. కణేకల్లులో కొనసాగుతున్న ఈ క్రాప్ బుకింగ్ ప్రక్రియను సోమవారం ఏఓ శ్రవణ్‌కుమార్‌తో కలసి ఏడీఏ పరిశీలించారు. తప్పులకు తావివ్వకుండా పక్కాగా ఈ- క్రాప్ బుకింగ్ చేయాలని ఆర్బీకే సిబ్బందికి ఏడీఏ ఆదేశించారు. సీసీఆర్‌సీ కార్డు పొందిన రైతులను వెంటనే సంప్రదించి పంట రుణాలందించేలా చూడాలన్నారు. ఎన్‌పీసీఐ లింక్ చేయించని వారికి పోస్టాఫీసులో తక్షణమే చేయించాలని ఆర్బీకే సిబ్బందికి సూచించారు. ఈ- క్రాప్ బుకింగ్‌కు ఈనెల 15లోపు పూర్తి చేయాలన్నారు. రైతులు వ్యవసాయ సిబ్బందికి సహకరించాలన్నారు.

క్లుప్తంగా

డెంగీ వ్యాధి నిర్ధారణ కిట్ల పంపిణీ


డెంగీ నిర్ధారణ కిట్లను అందిస్తున్న మలేరియా సబ్ యూనిట్ అధికారి కోదండరామిరెడ్డి

ఉరవకొండ: ఉరవకొండ, వజ్రకరూరు, విడపనకల్లు మండలాల్లోని పలు పీహెచ్‌సీలకు ఉరవకొండ మలేరియా సబ్‌యూనిట్ అధికారి కోదండరామిరెడ్డి సోమవారం డెంగీ వ్యాధి నిర్ధారణ కిట్లు, ఆలో లిక్విడ్ పంపిణీ చేశారు. ఉరవకొండ సీహెచ్‌సీలో వైద్యాధికారిణి డాక్టర్ శైలజకు ఎన్ఎస్‌వన్ కిట్లు అందించారు. అలాగే వజ్రకరూరు మండలం కొనకొండ్ల మెడికల్ ఆఫీసర్ గంగాధర్, ఉరవకొండ వైద్యాధికారులు వినీత, హరిత, అర్జున్, సాహితకు కిట్లు పంపిణీ చేశారు. మలేరియా సబ్‌యూనిట్ ఆఫీసర్ మాట్లాడుతూ ఉరవకొండ, విడపనకల్లు, వజ్రకరూరు పరిధిలోని వైద్యసిబ్బంది డెంగీ, మలేరియా వ్యాధులు ప్రబలకుండా ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. ఇప్పటికే అన్నీ పీహెచ్‌సీలకు డెంగీ నిర్ధారణ కిట్లు అందించామన్నారు. ప్రతి ఒక్కరూ పరిసరాలను శుభ్రం చేసుకుని, ఇంట్లో పాత వస్తువులు లేకుండా బయటకు పడేయలన్నారు.

తక్షణ సాయం పంపిణీ

ఉరవకొండ: స్థానిక ఐదో వార్డులో సచివాలయం-1 పరిధిలో నివాసముంటున్న చాకలి రామాంజనేయులు ఇటీవల మృతి చెందడంతో సోమవారం మృతుని కుటుంబానికి వైఎస్సార్ బీమా తక్షణసాయం అందించారు. మృతుని కుటుంబ సభ్యులకు ఉపసర్పంచ్ వన్నప్ప, ఇన్‌చార్జ్ ఈఓ రమణ, వెల్ఫేర్ అసిస్టెంట్, ఎడ్యుకేషన్ అసిస్టెంట్ రామేశ్వరి రూ.10 వేల నగదు పంపిణీ చేశారు. వైఎస్సార్ బీమా మిగతా సాయం త్వరలోనే నామినీ ఖాతాకు జమవుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ జానకి, వలంటీరు ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

గొంచిరెడ్డిపల్లిలో 'ఫ్యామిలీ ఫిజిషియన్'


అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న డాక్టర్ రాజేష్ కుమార్

బ్రహ్మసముద్రం: మండలంలోని గొంచిరెడ్డిపల్లిలో సోమవారం వైద్యాధికారి డాక్టర్ రాజేష్ కుమార్ ఆధ్వర్యంలో ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం గ్రామంలో దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న రోగుల ఇంటి వద్దకే వెళ్ళి వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ ముంతాజ్, అంగన్‌వాడీ టీచర్ తిప్పేరమ్మ, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో కాపు ప్రవీణ్‌రెడ్డి



శ్రీవారి ఆలయం ఎదుట కాపు ప్రవీణ్‌రెడ్డి

రాయదుర్గం: తిరుమల శ్రీవారిని రాష్ట్ర ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి తనయుడు, వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు కాపు ప్రవీణ్‌రెడ్డి, విప్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పీఏ శ్రీధర్‌రెడ్డి తో కలసి సోమవారం దర్శించుకున్నారు. అనంతరం ఆయన వలంటీర్లతో కలసి ఆలయంలో పలు సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఆస్తి తగాదాపై కేసు నమోదు

గుమ్మఘట్ట: మండలంలోని జె.వెంకటంపల్లిలో ఆస్తి తగాదా విషయమై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సునీత తెలిపారు. గ్రామానికి చెందిన రంగారెడ్డి, అతని కుమారులు లక్ష్మీరెడ్డి, చిరంజీవిరెడ్డిపై ఇద్దరు వ్యక్తులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. నిందితులను అరెస్ట్ చేసి రిమాండుకు తరలించినట్లు ఆమె తెలిపారు.

నేడు మారెమ్మ జాతర


ముస్తాబైన మారెమ్మ ఆలయం

బ్రహ్మసముద్రం: మండలంలోని భక్తులు కొంగు బంగారంగా వెలుగొందుతున్న మారెమ్మ జాతర మంగళవారం నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు సోమవారం తెలిపారు. ఏటా శ్రావణమాసం చివరి మంగళవారం నాగిరెడ్డిపల్లిలో గ్రామ దేవత మారెమ్మ దేవికి జాతరను నిర్వహించడం ఆనవాయితీ. జాతరను వైభవంగా నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు.